క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరాలతో పేదలకు మేలు



మందులు అందజేస్తున్న డీఎస్పీ

మెట్‌పల్లి: ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు జరుగుతోందని డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేత్ర వైద్య శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం లయన్స్ క్లబ్ ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మీనారాయణ, అధ్యక్షులు దొంతుల అంజనేయులు, సభ్యులు ఉన్నారు.

రోడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలి



వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ధర్మపురి: రోడ్ల అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని బీజేపీ నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా రోడ్ల పనులను చేపడుతున్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పట్టణంలో రోడ్ల అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, నెలల తరబడి పనులు నిలిచిపోవడంతో వాహన దారులు, పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వినాయక చవితి సందర్భంగా మండపాలకు వచ్చే భక్తులకు రోడ్ల సౌకర్యం లేక ఇబ్బందులు పడే అవకాశాలున్నాయని, వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లవన్‌కుమార్, పిల్లి శ్రీనివాస్ బండారు లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్,భాస్కర్ తదితరులున్నారు.

చీడపీడల నివారణకు చర్యలు చేపట్టాలి



పొలాన్ని పరిశీలిస్తున్న ఏవో దీపిక

ఇబ్రహీంపట్నం: వర్షాకాలంలో వరి పంటలకు సోకే చీడ, పీడల నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి దీపిక కోరారు. మంగళవారం మండలంలోని యామాపూర్‌లో వరిపంటకు సోకిన తెగుళ్లను ఆమె పరిశీలించారు. వరిపంటకు బ్యాక్టీరియా ,ఎండాపు తెగులు, అగ్గితెగులు, పాముపొడ తెగులు, కాటుక తెగులు సోకుతున్నట్లు తెలిపారు. దీని నివారణకు తొలి దశలోనే రైతులు ఎలాంటి మందులను వాడాలో వివరించారు. కార్యక్రమంలో ఏఈవో రవళిక, రైతులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో వసతులు కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

కథలాపూర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని తహసీల్దార్‌కు ఏబీవీపీ నాయకులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. రోడ్డు గుంతలమయంగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏళ్లుగా రోడ్డు సమస్య పరిష్కరించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మాడవేని సునీల్, సాయితేజ, వినయ్, తరుణ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

కవిత పర్యటనను విజయవంతం చేయాలి

రాయికల్: జగిత్యాల మండలం చల్‌గల్‌లో బుధవారం ఎమ్మెల్సీ కవిత పర్యటించనున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సురేందర్ నాయక్ కోరారు. మండలంలోని తాట్లవాయి, ధర్మాజీపేట, ఆల్యానాయక్‌తండా, కైరిగూడెం గ్రామాల్లో మంగళవారం బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే విస్తృత స్థాయి సమావేశానికి కార్యకర్తలు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నందు నాయక్, రాజేశం, హరీశ్, రాగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులపై నిర్లక్ష్యం..!



జూలైలో కురిసిన వర్షాలకు మెట్‌పల్లి మండలం కేసీఆర్ తండా శివారులో రహదారి కుంగిపోయి భారీ గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కేసీఆర్ తండాకు చెందిన లింబాద్రి అనే వ్యక్తి ఈ మార్గం గుండా రాత్రి సమయంలో వెళ్తుండగా, ద్విచక్రవాహనం అదుపుతప్పి గుంతలో పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. ఇలా ఈ ఒక్క అతనే కాదు చాలా మంది ప్రమాదకరంగా మారిన కల్వర్టులు, కోతకు గురైన రహదారులతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- ప్రమాదకరంగా కల్వర్టులు,రహదారులు
- మరమ్మతులపై దృష్టి సారించని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కేసీఆర్ తండా శివారులో కోతకు గురైన రహదారి

మెట్‌పల్లిరూరల్: గతేడాది,ఈ ఏడాది కురిసిన వర్షాలతో దెబ్బతిన్న కల్వర్టులు,కోతకు గురైన రహదారుల మరమ్మతులపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. వర్షాలకు మెట్‌పల్లి మండలంలో పలు చోట్ల కల్వర్టుల వద్ద రహదారులు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. దీంతో ఆయా మార్గాల గుండా ప్రయాణించే వాహనదారులు ఎప్పుడేం జరుగుతోందనన్న ఆందోళన చెందుతున్నారు. దెబ్బతిన్న ప్రాంతాల్లో కొన్ని పనులకు నిధులు మంజూరు కాగా, మరికొన్ని పనులకు ప్రతిపాదనలు పంపిన అధికారులు తాత్కాలిక మరమ్మతులపై దృష్టి సారించకపోవడం గమనార్హం.

మూడు చోట్ల ప్రమాదకరంగానే..

మెట్‌పల్లి మండలంలో చింతలపేట శివారులో లోలెవల్ కల్వర్టు వద్ద రహదారి కోతకు గురైంది.ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణం చేపట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపించగా ఆర్‌అండ్‌బీ నుండి రూ.60 లక్షలు నిధులు మంజూరయ్యాయి. కానీ ఇంతవరకు పనులు ప్రారంభంకాలేదు. రంగారావుపేట-కేసీఆర్ తండా గ్రామాల మధ్య కల్వర్టు వద్ద రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. వీటి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించినా నిధులు మంజూరు కాలేదని అధికారులు చెబుతున్నారు.అలాగే ఈ ప్రాంతంలోనే వరద ఉధృతికి మరో చోట రహదారి కుంగిపోయి భారీ గుంత ఏర్పడింది. ఈ గుంతలో పడి పలువురు గాయపడ్డారు. దీంతో ఈ దారి గుండా రాత్రి ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు.

తాత్కాలిక మరమ్మతులు, సూచికలు కరువు

రంగారావుపేట-కేసీఆర్‌తండా మధ్యలో కల్వర్టు వద్ద కోతకు గురైన రహదారి వద్ద, ఇదే ప్రాంతంలో మరో చోట కుంగిపోయిన రహదారి వద్ద రెండు చోట్ల తాత్కలిక మరమ్మతులు చేయించే విషయంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. చింతలపేట శివారులో కల్వర్టు వద్ద మట్టి పోసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలకు మరలా కొట్టుకుపోవడంతో రోడ్డు ఎప్పటిలాగే తయారైంది. మరోవైపు వర్షాల వల్ల కోతకు గురైన రహదారులు, ఏర్పడిన భారీ గుంతల వద్ద కనీసం సూచిక బోర్డులు సైతం ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడైన రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే ప్రారంభించేలా చర్యలు

చింతపేట శివారులో కల్వర్టు వద్ద వంతెన పనులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి.కానీ వరద నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. నీటి ప్రవాహం ఉండడంతో పనులు ఇంకా ప్రారంభించలేదు. తగ్గాక వెంటనే పనులు ప్రారంభిస్తాం. మిగతా చోట్ల కోతకు గురైన రహదారుల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపడుతాం.

– వేణు,ఏఈ ఆర్‌అండ్‌బీ, మెట్‌పల్లి

అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చాలి



కోరుట్ల,ధర్మపురిలో దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, వివిధ పార్టీల నాయకులు

మల్యాల: అంగన్‌వాడీ టీచర్లను రెగ్యులరైజ్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని, న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, ఎంపీపీ మిట్టపల్లి విమల, బీఎస్పీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో దీక్ష చేపట్టిన అంగన్‌వాడీ టీచర్ల దీక్ష శిబిరాన్ని మంగళవారం సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పెగడపల్లి: అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఎస్పీ ధర్మపురి నియోజకవర్గం ఇన్‌చార్జి నక్క విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. పెగడపల్లిలో దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపారు.

సమ్మె విచ్ఛిన్నం చేసేందుకు అధికారుల కుట్ర

పెగడపల్లి: సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా తాము చేస్తున్న సమ్మెను అధికారులు విచ్ఛిన్నం చేయడం సమంజసం కాదని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. తమ సమస్యలను పరిష్కారించాల్సిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలు నడిపించేందుకు చర్యలు తీసుకోవడం సరైంది కాదన్నారు. బతికపల్లి సర్పంచ్ శోభారాణి, బీజేపీ మండల అధ్యక్షుడు గంగుల కొమురెల్లి వారికి సంఘీభావం తెలిపారు.

ధర్మపురి: అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

కోరుట్ల: అంగన్‌వాడీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దాసరి రాజశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి తిరుమల వాసు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, జగిత్యాల టౌన్ అధ్యక్షుడు, జిల్లా మీడియా కన్వీనర్ శివసాయి రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

డెంగీ వ్యాప్తిపై సర్వే



వివరాలు సేకరిస్తున్న డాక్టర్ రమేశ్, సిబ్బంది

వెల్గటూర్: మండల కేంద్రంలో డెంగీ వ్యాప్తిపై వెల్గటూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేశ్ వివరాలు సేకరించారు. డెంగీ సోకిన వారి ఇంటి పరిసరాల్లో దోమల మందు పిచికారీ చేయించారు. అనంతరం వెల్గటూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి అనుమానితులను 40 మందిని పరీక్షించగా ముగ్గురికి కుష్టు వ్యాధి నిర్ధారణ కాగా, వారికి చికిత్స అందించారు. ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో సర్వే నిర్వహించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్స్ దేవ్‌సింగ్, హీర్యానాయక్, సీహెచ్‌వో జగన్నాథం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రజలు చేరువవుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన 30 మంది కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు వెన్నంటి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, సర్పంచ్ అంకం మమత, నాయకులు జలేందర్, మహేశ్, రాజ్‌కుమార్, జగదీశ్, వినోద్, ప్రశాంత్, ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు కొత్తూరి తిరుపతి పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని వినతి

జగిత్యాల: మున్నూరుకాపు సంఘ భవనానికి గతంలో రూ.3 లక్షలు మంజూరు చేశారని, అదనపు పనుల నిమిత్తం నిధులు మంజూరు చేయాలని పట్టణంలోని హనుమాన్‌వాడకు చెందిన హనుమాన్ మున్నూరుకాపు సేవ సంఘం సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కూతురు రాజేశ్, సమిండ్ల శ్రీనివాస్, సుధాకర్, వెంకట్‌రెడ్డి, కూతురు శేఖర్, రమేశ్, మధుకర్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా మైలారపు రాము



రామును అభినందిస్తున్న సంఘ సభ్యులు

మెట్‌పల్లి: పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మైలారపు రాము ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక వాసవీ గార్డెన్‌లో ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష పదవికి మైలారపు రాము, దొమ్మాటి ప్రవీణ్ పోటీ పడ్డారు. వీరిలో అత్యధిక ఓట్లతో రాము విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు మంచాల రవీందర్, కంటాల మధుచందర్ తెలిపారు. గెలుపొందిన రామును సంఘ సభ్యులు సన్మానించారు. ఆర్యవైశ్యులకు అండగా ఉండి, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం

గొల్లపల్లి: ధర్మపురి నియోజకవర్గంలోని ఏడు మండలాల నాయీబ్రాహ్మణ సేవ సంఘం ఇన్‌చార్జిగా ముత్యాల స్వామిని నియమించారు. గౌరవ అధ్యక్షుడిగా అమరవెల్లి నారాయణ, కార్యవర్గ సభ్యులుగా పసుపునూటి అనిల్, పాల గణేశ్, వొల్లోజి కనకయ్య, రాచమల్ల మల్లేశంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జగిత్యాల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి గంగిపెల్లి వేణు మాదవ్, వెల్గటూర్ మండల అధ్యక్షుడు కంది తిరుపతి, ధర్మారం అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గృహలక్ష్మితో పేదల సొంతింటి కల సాకారం

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



పొసీడింగ్ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి: గృహలక్ష్మి పథకంలో పేదల సొంతింటి కల సాకారమవుతోందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. పట్టణంలోని నరేందర్ రెడ్డి గార్డెన్‌లో మంగళవారం గృహలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్ లత ప్రొసీడింగ్ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న వారిలో మొదటి విడతగా 398 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. దశల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహలక్ష్మి కింద ఆర్థికసాయం చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తున్న తన కుమారుడు సంజయ్‌ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, ఆర్డీవో మధు, కమీషనర్ జగదీశ్వర్‌గౌడ్, ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో అందుబాటులో యూరియా

సారంగాపూర్: మండలంలోని రైతులకు సరిపడా యూరియా మరో రెండు రోజుల్లో అందుబాటులోకి వస్తుందని మండల వ్యవసాయాధికారి తిరుపతినాయక్ అన్నారు. మంగళవారం సారంగాపూర్ మండల కేంద్రంలో రైతులు యూరియా కొరత తీర్చాలని రైతులు కోరగా దీనిపై స్పందించిన ఆయన రెండు రోజుల్లో మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా యూరియా అమ్మకాలు సరిపడా అందిస్తామని తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

బీర్‌పూర్ మండలంలో యూరియా అందుబాటులో ఉందని ఏవో అనూష తెలిపారు. మంగళవారం ఎరువుల దుకాణాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో తనిఖీ చేపట్టారు. రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.

ఐఎంఏ, ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేటలో ప్రెస్‌క్లబ్, ఐఎంఏ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కోరుట్ల ఐఎంఏ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భం డాక్టర్ అనూప్ రావు మాట్లాడుతూ కోరుట్ల ప్రెస్ క్లబ్ సేవలు అభినందనీయం అన్నారు. 280 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సరికెళ్ల మల్లారెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముక్కెర శేఖర్, ఐఎంఏ కోరుట్ల అధ్యక్షుడు రేగొండ రాజేష్, డాక్టర్లు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని శ్రీసాయి క్లినిక్‌లో మంగళవారం రెనే ఆస్పత్రి కరీంనగర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గుండె వైద్య నిపుణులు తాటిమల్ల దినకర్ పాల్గొని సుమారు 200 మందికి ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగాధర్, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ జమున, మాజీ వైస్ ఎంపీపీ కరుణాకర్‌రావు ఆర్ఎంపీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

కథలాపూర్: గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో వివిధ గ్రామాల వినాయక మండప నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుడిని ప్రతిష్ఠించి నిమజ్జనం చేసేవరకు నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో హెడ్‌కానిస్టేబుల్ నీలానాయక్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

గొల్లపల్లి: అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కోసం స్టేట్ కమిటీ పిలుపు మేరకు రెండో రోజు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సురేందర్, చందు, సంజీవ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మల్యాల: పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ అన్నారు. మండలంలోని రామన్నపేటలో మంగళవారం పోషణ మాసం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో పోషక ఆహార పదార్థాలు ప్రదర్శించి పంపిణీ చేశారు. తల్లులతో పోషకాహార ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రేణుక, తల్లులు పాల్గొన్నారు.

జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

కోరుట్ల: పట్టణంలోని కేపీఎస్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి కే. పూజిత్ మెట్‌పల్లి లో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటి 3వ స్థానం సాధించాడు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి ఏ. ముత్తయ్య రెడ్డి పూజిత్ కు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పూజిత్‌ను పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు బస్ పాస్‌ల అందజేత

సారంగాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్టీసీ బస్సు పాస్‌లను ఎస్సై తిరుపతి ఉచితంగా అందజేశారు. బస్ పాస్‌లకు అయ్యే ఖర్చును ఎస్సై సొంతంగా భరించి, విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సైని హెచ్‌ఎం సన్మానించారు.ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటు హక్కు అందరి బాధ్యత

జగిత్యాలటౌన్: ఓటు హక్కు ప్రాముఖ్యత తెలుపుతూ పట్టణంలోని వైష్ణవి కళాశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ పటేల్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మహేశ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలో మంగళవారం ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి రథోత్సవం

మల్యాల: మండలంలోని ఒబులాపూర్‌లో వీరభద్ర స్వామి రథోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లో రథోత్సవం నిర్వహించారు. భక్తులు రథోత్సవంలో పాల్గొని, స్వామివారికి పూజలు చేశారు. ఎంపీపీ మిట్టపల్లి విమల, మల్యాల మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, ఒబులాపూర్ సర్పంచ్ సరోజన, పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

రాయికల్: పట్టణ శివారులో సోమవారం అర్ధరాత్రి ఇసుక ట్రాక్టర్ బోల్తాపడటంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మూటపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా రాయికల్ పట్టణ శివారులో బ్రిడ్జి వద్ద మైనర్ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో బోల్తా పడింది. ట్రాక్టర్ యజమాని విషయం బయటకు పొక్కకుండా జేసీబీ సాయంతో ఇసుకను తరలించి ట్రాక్టర్‌ను మరో చోటుకు తరలించారు. ఇసుక అక్రమ రవాణాపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు



మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ అధికారి శ్యామ్

కథలాపూర్: ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని, రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుట్ల డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి శ్యామ్ అన్నారు. మండలంలోని భూషణరావుపేట రైతు వేదికలో మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీపై మొక్కలు, డ్రిప్ పైపులు అందిస్తుందన్నారు. పంటకు తక్కువ నీరు అవసరం ఉంటుందని, అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఆయిల్ పామ్ పంట సాగు చేస్తే ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కంపెనీలు కొనుగోలు చేస్తాయన్నారు. సమావేశంలో లోహియా ఆయిల్ పామ్ పరిశ్రమ జిల్లా మేనేజర్ భరత్, ఏవో యోగితా, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, సర్పంచ్ కూన సులోచన, ఏఈవోలు, రైతు బంధు సమితి అధ్యక్షుడు బద్దం మహేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ‘అడ్లూరి’ పరామర్శ

ధర్మపురి: వివిధ సమస్యలతో బాధపడుతున్న పలువురిని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన ఆకుల గౌరవ్వ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని, అదే గ్రామానికి చెందిన అరికిల్ల స్వామి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారిని లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. సర్పంచ్ పులిశెట్టి మల్లేశం షుగర్‌తో బాధపడుతుండగా, పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఎస్ దినేశ్, ఎంపీటీసీ గంగాధర్, నర్సింహులు, గణేశ్, ఆకుల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

మల్లాపూర్: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశ కార్యకర్తలు మంగళవారం మల్లాపూర్‌లో నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'ఆరోగ్య మహిళ' కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీవో హాజరుకాగా, ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఆశ కార్యకర్తలకు కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తూ రూ.28వేలు ఇవ్వాలని, ప్రతీ ఏడాది రెండు జతల యూనిఫాంతో పాటు బీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు.

సేవా సమితి మహిళలతో లడ్డూల తయారీ



కొండగట్టు: కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి వారి ఆలయంపై మంగళవారం శ్రీరాజరాజేశ్వర సేవా సమితి రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో కొంతమంది మహిళలు లడ్డూ తయారీ కేంద్రంలో పని చేశారు. దేవుడి సేవ కోసం వచ్చిన వారు సేవ చేయాలి తప్పా.. ఇలా తమకు సంబంధం లేని పనులు ఏలా చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. నిబంధనల మేరకు ప్రైవేట్ వ్యక్తులకు ప్రసాదం తయారీ కేంద్రంలోకి అనుమతి లేదు. దీనిపై కొంతమంది మహిళలను సాక్షి ప్రశ్నించగా తమని సేవకోసం తీసుకొచ్చారని, ఇక్కడకు వచ్చాక వారు ఏం చెప్తే అది చేస్తామని, మాకు రూ.350 చెల్లిస్తారని తెలిపారు. సేవ పేరుతో ప్రైవేట్ వ్యక్తులను అధికారులు ఆలయాల్లోకి ఎలా అనుమతిస్తారని, పూర్తి వివరాలు ఉంటే తప్పా ఏ సంస్థకు, సేవ కైనా అనుమతులు ఇవ్వొద్దని భక్తులు అధికారులను కోరుతున్నారు.